
2లో..

## తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణకు రండి

- కేసీఆర్ కు ఆహ్వాన పత్రిక అందించిన మంత్రి పొన్నం


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 76
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
డిసెంబర్ 07, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## భూ నిర్వాసితులను ఆదుకుంటా

- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


8లో..

## లంచం ఇచ్చినా.. తీసుకున్నా నేరం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



8లో..

## మా బిల్డింగ్ మాకే కావాలి

- నర్సింగ్ కళాశాలకు కేటాయించడం సరికాదు
- ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతి

# మరో ఆరు నెలలు.. ఆగాల్సిందే



- సంక్రాంతికి సన్నబియ్యం లేనట్లే
- తప్పిన ప్రభుత్వ పెద్దల అంచనాలు
- కనీస చర్యలు చేపట్టని పౌరసరఫరాల శాఖ
- దొడ్డు బియ్యం సేకరణకు మిల్లర్లకు ఆదేశాలు
- సన్నగిల్లుతున్న ఆశలు


వివరాలు2లో..

సన్న బియ్యం పంపిణీపై ప్రభుత్వ పెద్దల ఆలోచన బెడిసికొట్టినట్టే కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామంటూ గత కొంత కాలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించినా ఆచరణలో సాధ్యమయ్యేలా లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 90 లక్షల ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 2లక్షల టన్నుల చొప్పున ఏడాదికి 24 లక్షల టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ లెక్కన మొత్తం 36లక్షల టన్నుల సన్న ధాన్యం సేకరించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు సివిల్ సప్లై సంస్థ 10 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. ఇంకో 5లక్షల టన్నులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో మరో 20 లక్షల టన్నుల ధాన్యం తక్కువ పడుతోంది. ఇంత భారీస్థాయిలో సన్న బియ్యాన్ని బయట కొనుగోలు చేసి పంపిణీ చేస్తే పౌరసరఫరాలశాఖపై భారీ ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో రేషన్‌లో సన్న బియ్యం పంపిణీ వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అందుకు తగ్గట్టుగానే మరో ఆరు నెలలకు అవసరమైన దొడ్డు బియ్యం సేకరణ కోసం అధికారులు మిల్లర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

- వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

## గురుకులంలో కాలం చెల్లిన మందులు



- నిర్లక్ష్యం వహిస్తున్న వైద్య సిబ్బంది
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సొంత ఊరిలో ఘటన

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని చెర్లపాలెం సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో కాలం చెల్లిన మందులు కలకలం రేపుతున్నాయి. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సొంత ఊరిలోనే ఉన్న బాలుర వసతి గృహంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి కాలం చెల్లిన మందులను విద్యార్థులకు పింపిణీ చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తుండగా మరో వైపు కాలం చెల్లిన మందులు ఇవ్వడం ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అయితే శుక్రవారం మెడికల్ క్యాంప్ నిర్వహించి కాలం చెల్లిన మందులు ఇచ్చారంటూ అటెండర్ చెప్పడం కొసమెరుపు. – వరంగల్ వాయిస్, తొర్రూరు


2లో..

## రోకలి బండతో తలపై బాది హత్య

- ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాల అపహరణ
- విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి హత్యను ఛేదించిన పోలీసులు
- పోలీసుల అదుపులో నిందితుడు



# మరో ఆరు నెలలు.. ఆగాల్సిందే

- సంక్రాంతికి సన్నబియ్యం లేనట్లే
- తప్పిన ప్రభుత్వ పెద్దల అంచనాలు
- కనీస చర్యలు చేపట్టని పౌరసరఫరాల శాఖ
- దొడ్డు బియ్యం సేకరణకు మిల్లర్లకు ఆదేశాలు
- సన్నగిల్లుతున్న ఆశలు

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** సంక్రాంతి నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించారు. కానీ ప్రకటనలకు అనుగుణంగా పని మాత్రం కావడం లేదని సమాచారం. సన్నబియ్యం పంపిణీకి పౌరసరఫరాల శాఖ కనీస చర్యలు కూడా ప్రారంభించలేదని తెలుస్తోంది. మంత్రులు ఇచ్చిన హామీ ప్రకారం సన్న బియ్యం పంపిణీకి మరో నెల రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. కానీ ఇప్పటివరకు సన్న బియ్యం సేకరణే జరుగలేదు. దీంతో ఇప్పటివరకు జిల్లా అధికారులకు సైతం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో అధికారులు సైతం ఏమీ చెప్పలేకపోతున్నారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,23,497 కార్డులుండగా 3,44,935 మంది లబ్ధిదారులున్నారు. వీరందరికీ 277 రేషన్ దుకాణాలు బియ్యం సరఫరా జరుగుతోంది.

### బెడిసికొట్టిన ఆలోచన..

సన్న బియ్యం పంపిణీపై ప్రభుత్వ పెద్దల ఆలోచన బెడిసికొట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సన్న ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తున్నందున అధిక విస్తీర్ణంలో సన్నాలు సాగవుతాయని, వాటి ద్వారా సన్న బియ్యం ఇవ్వొచ్చని ప్రభుత్వం ఆలోచించినట్టు తెలుస్తోంది. అయితే ఇందుకు విరుద్ధంగా పౌరసరఫరాల సంస్థకు సన్నాలు రాకపోవడంపై అధికారుల్లో అంతర్మథనం మొదలైంది. వాస్తవానికి సన్న బియ్యం పంపిణీకి ఏటా 24లక్షల టన్నుల బియ్యం కోసం 36లక్షల టన్నుల ధాన్యం అవసరం ఉంది. కానీ ఇప్పటివరకు సివిల్ సప్లై సంస్థ 10 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. ఇంకో 5లక్షల టన్నులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన మరో 20 లక్షల టన్నుల ధాన్యం తక్కువ పడుతోంది.

### దొడ్డు బియ్యంకోసం ఆదేశాలు..

ప్రస్తుతం బహిరంగ మార్కెట్ లో సన్నబియ్యం ధరలు భగ్గుమంటున్నాయి. కిలో రూ.50 నుంచి రూ.60 వరకు వెచ్చించాల్సి వస్తోంది. వాటి సరఫరా తక్కువగా ఉండి వినియోగం ఎక్కువగా ఉండటంతో సన్నాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో ప్రైవేట్ గా సన్నబియ్యం కొనుగోలు చేసి పంపిణీ చేయాలంటే పౌరసరఫరాలశాఖపై అధిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో రేషన్‌లో మరో ఆరు నెలల పాటు దొడ్డు బియ్యాన్నే పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు తగ్గట్టుగానే మరో ఆరు నెలలకు అవసరమైన దొడ్డు బియ్యం సేకరణ కోసం అధికారులు మిల్లర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ఇప్పట్లో సన్న బియ్యం పంపిణీ లేనట్లేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# రోకలి బండతో తలపై బాది హత్య

- ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాల అపహరణ
- విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి హత్యను ఛేదించిన పోలీసులు
- పోలీసుల అదుపులో నిందితుడు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఇంటికి పిలిచి మద్యం తాగించి తర్వాత రోకలి బండతో తలపై విచక్షణా రహితంగా పలుమార్లు కొట్టడంతోపాటు దండెం తాడుతో కట్టేసి అరువకుండా నోట్లో తువ్వాల పెట్టి, కాళ్లు కొట్టుకోకుండా కుక్క గొలుసుతో కట్టేసి దానికి తాళం వేసి గోనెసంచిలోకి కుక్కి కర్కషంగా హత్య చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ములుగు జిల్లా, మంగపేట మండలం, కోమటిపల్లి గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాసరావు హనుమకొండలోని ప్రగతి నగర్, రెవెన్యూ కాలనీలో కిరాయికి ఉంటూ కోమటిపల్లికి చెందిన మణెమ్మతో సహజీవనం చేస్తున్నారు. యూట్యూబ్ జర్నలిస్టుగా పనిచేస్తున్న శ్రీనివాసరావు వివిధ ప్రాంతాల్లో బెదిరింపులకు పాల్పడినట్లు వెల్లడించారు. రెవెన్యూ కాలనీలో ఉంటున్న విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి వెలిగేటి రాజమోహన్ తో శ్రీనివాస్ కు పరిచయం ఏర్పడింది. దీంతో శ్రీనివాస్ ను పూర్తిగా నమ్మిన రాజమోహన్ తన కుటుంబ వివరాలన్నీ అతనితో పంచుకున్నాడు. తన కూతురు అమెరికాలో ఉంటుందని, భార్య మృతి చెందడంతో ఒంటిగా ఉంటున్నానని చెప్పాడు. తనకు తోడుగా ఎవరైనా ఉంటే చూడమని శ్రీనివాస రావును కోరాడు. అయితే గతంలోనే తనకు రూ.5లక్షలు కావాలంటూ రాజమోహన్ ను శ్రీనివాసరావు కోరారు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీ రాత్రి తన ఇంటికి రావాలంటూ రాజమోహన్ ను శ్రీనివాసరావు ఆహ్వానించారు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో శ్రీనివాసరావు ఇంటికి చేరుకోగా ఇద్దరు కలిసి మద్యం సేవించారు. ఇద్దరి మధ్య మరోమారు రూ.5లక్షల ప్రస్తావన వచ్చింది. దీంతో తన దగ్గర డబ్బులు లేవంటూ రాజమోహన్ చెప్పడంతో ఆగ్రహించిన శ్రీనివాస్ పక్కనే ఉన్న రోకలి బండతో తలపై పలుమార్లు కొట్టి కర్కశంగా హత్య చేశాడు. అతని ఒంటిపై ఉన్న బంగారు బ్రాస్లెట్, గొలుసు, మూడు ఉంగరాలు తీసుకొన్నాడు. అనంతరం గోనె సంచిన కుక్కిన రాజమోహన్ మృతదేహాన్ని ఆయన తెచ్చుకున్న కారు వెనుక సీటులో వేసి పట్టణ శివారులో ఎక్కడైనా పడేద్దాం అనే ఉద్దేశంతో నిందితుడు కారుని నడుపుకుంటూ వడ్డేపల్లి రోడ్డు, కేయూసీ జంక్షన్, డబ్బాలు తదితర ప్రాంతాల్లో తిరిగాడు. అయా ప్రాంతాల్లో జన సంచారం ఎక్కువగా ఉండడంతో అక్కడినుంచి భద్రకాళి గుడి దాటి రంగంపేట ఏరియాకి వచ్చి అక్కడ ఎలాంటి జనసంచారం లేకపోవడంతో రోడ్డు పక్కన కారును నిలిపి మృతుడికి సంబంధించిన చెప్పులను అక్కడే ఒక ఇంటి దగ్గర్లో వదిలిపెట్టాడు. అక్కడినుంచి రోడ్డు వరకు నడుచుకుంటూ వచ్చి ఒక ఆటోలో వెళ్లిపోవడం జరిగిందని పోలీసులు వివరించారు. ఇంటిదగ్గర ఎలాంటి ఆధారాలు దొరకకుండా అన్నింటినీ కడిగేసి వెనుక తుప్పల్లో దాచి పెట్టాడు. మృతుడికి సంబంధించిన మొబైల్ ఫోను కూడా ఇంటిలో దాచిపెట్టాడు. కేసు సవాల్ గా తీసుకున్న పోలీసులు నిధితుడిని శనివారం అదుపులోకి తీసుకొని విచారించగా తన నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడించారు.

# తెలంగాణ తల్లి విగ్రహ ఆష్కరణకు రండి

- కేసీఆర్ కు ఆహ్వాన పత్రిక అందించిన మంత్రి పొన్నం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఈనెల 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును రాష్ట్ర బీసీ, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారు. కేసీఆర్ ను ఆహ్వానించేందుకు ఎర్రవెల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ బృందాన్ని మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వంశిధర్ రావు తదితరులు సాదర స్వాగతం పలికారు. తన నివాసానికి వచ్చిన మంత్రికి లంచ్ ఆతిథ్యమిచ్చి కేసీఆర్ గౌరవించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సంధర్భంగా ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఉద్యమ జ్ఞాపకాలను ఇరువురు నేతలు నెమరు వేసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట ప్రభుత్వ ప్రొటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారుడు హర్కర వేణుగోపాల్, డిపార్ట్మెంట్ ఆఫ్ ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్రావు తదితరులున్నారు.

# ఘనంగా అయ్యప్ప పడిపూజ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినం సందర్భంగా త్రిశూల్ ఫౌండేషన్ అధినేత అవురు పల్లి శ్రీకాంత్ కౌళాచార్య ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప పడిపూజ, హోమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీమాతా అనుగ్రహ శక్తి పీఠాధిపతులు బ్రహ్మశ్రీ వంగల శ్రీనివాసచార్యులు, అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ అధ్యక్షులు రాజ్ దేశ్ పాండే, రాష్ట్రీయ హిందూ పరిషత్ మహబూబబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుగంటి దీక్షితులు, భారతీయ జనతా పార్టీ నాయకులు గందె నవీన్, కొలిపాక శ్రీనాథ్, పాలకుర్తి ఆంజనేయ శర్మ ముఖ్య అతిథితులుగా విచ్చేసి పడిపూజలో పాల్గొన్నారు. మహాశాస్త సహిత రుద్రహోమము అనంతరము జాతీయ అధ్యక్షులు రాజ్ దేశ్ పాండే మాట్లాడుతూ భారత జాతి అభివృద్ధికి గో సేవ ప్రధానమన్నారు. నైతిక విలువలకు అయ్యప్ప స్వామి దీక్ష సనాతన ధర్మమును కాపాడుతూ హైందవ జాతిని ఏకతాటిపై నడిపించే సాధన యోగమని ప్రతి ఒక్కరు కూడా మహాశాస్త దీక్ష తీసుకొని ఉద్ధరించాలని తెలిపారు. అయ్యప్ప స్వామికి అభిషేకములు, మహా పడిపూజ విశేషముగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఇట్టి కార్యక్రమంలో రావుల కిరణ్, ఉప్పుల రాకేష్,పెద్ద పెల్లి కృష్ణ, రవితేజా, పిట్ట విక్రమ్, కోక చలపతి, తక్కెళ్ళపల్లి వేణుగోపాల్, వాడిక సతీష్, గోపిరెడ్డి అమర్, అధిక సంఖ్యలో అయ్యప్పలు భక్తులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, డిసెంబర్ 06, 2024

# స్త్రీలపై దాడులు మానవ హక్కుల ఉల్లంఘనే




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చైతన్య మహిళా సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ప్రపంచ మానవ హక్కుల దినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా స్త్రీలపై జరుగుతున్న హింసను ఖండిస్తూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి చైతన్య మహిళా సంఘం నుంచి కళా అధ్యక్షత వహిస్తూ 1960లో డోమినికన్ రిపబ్లిక్ లో అక్కడి నిరంకుశ పరిపాలకుడు రాఫీయేల్ ట్రూజిలో కు వ్యతిరేకంగా ఉద్యమంలో ముగ్గురు అక్క చెల్లెలు.. ప్రాటీయ, మారియ, మారియో తెరిసా హత్యగావించబడ్డారు.. లాటిన్ అమెరికా దేశాలు నవంబర్ 25న ఈ ముగ్గురు మహిళలు చంపి వేయబడ్డ రోజును, స్త్రీలపై హింసను వ్యతిరేకించే అంతర్జాతీయ దినంగా జరిపాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లను స్మరిస్తూ 1970 నుంచి అన్ని దేశాలు స్త్రీలపై హింసను వ్యతిరేకిస్తూ ఆరోజును నిర్వహించుకోవడం మొదలుపెట్టారని కళ తెలిపారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ రమాదేవి మాట్లాడుతూ భారత దేశంలో కూడా మహిళపై దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని, మహిళల హక్కులు కాలరాయపడుతున్నాయన్నారు. అమ్మాయిగా పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వచ్చేంత వరకు ఎక్కడ ఏదో ఒక రూపాన హక్కులకు భంగం కలుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు చదువు రూపంలో, మరోవైపు పెళ్లి రూపంలో, స్త్రీలు అటు భౌతికంగా, ఇటు మానసికంగా, సాంస్కృతికంగా, పితృ స్వామికంగా, చివరికి పని ప్రదేశాలలో కూడా శారీరకంగాను హింసించ బడుతున్నారన్నారు. అరసం భాద్యులు శంకర్ నారాయణ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళలకు జరుగుతున్న హక్కుల ఉల్లంఘన గురించి మాట్లాడాలని కోరారు. న్యూ డెమోక్రసీ నుంచి బాలరాజు మాట్లాడుతూ.. సమాజంలో పురుషులతో పాటు స్త్రీలు కూడా ఉన్నారని మానవ హక్కులు అంటే సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు కూడా మానవ హక్కులు ఉన్నాయని తెలిపారు. ఆ రకంగా ప్రతి ఒక్కరం పోరాటం చేయాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ జనగాం కుమారస్వామి, చైతన్య మహిళా సంఘం అమిత, జ్యోతి రమణి, విలాసిని, రమ, సుమ పాల్గొన్నారు.

# బీసీల సమర శంఖారావం జయప్రదం చేయండి



వరంగల్ వాయిస్, హనుమకొండ : తెలంగాణ బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 న ఢిల్లీలో జరిగే సదస్సు, సత్యాగ్రహ దీక్షలకు సంబంధించిన పోస్టర్లను శనివారం సుందర్ రాజ్ యాదవ్ , ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ ఆవిష్కరించారు. బీసీల సమరశంఖారావం విజయవంతం చేసి మనలో ఉన్న శక్తి సామర్థ్యాలను సమాజ హితం కోరి బీసీలను, ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలను ఏకతాటిపై నడపడానికి డిల్లీలోని కానిస్టిట్యూష్ క్లబ్ లో జరిగే సదస్సుకు, 12న జంతరమంతర్ వద్ద జరిగే సత్యాగ్రహ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. దేశ రాజధాని ఢిల్లిలో దేశవ్యాప్తంగా కులగణన, ఇతర సామాజిక , న్యాయ సమస్యలపై ఓబీసీల జాతీయ సదస్సు, సత్యాగ్రహ దీక్షలో పాల్గొని బీసీల హక్కుల కోసం రాజ్యాధికారం దిశగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఠం నాయకులు దారం జనార్ధన్, సామాజిక వేత్త కె. వీరస్వామి, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం సభ్యులు రిటైర్డ్ ఇంజినీర్ వైద్యం రాజగోపాల్, పూజరి సత్యనారాయణ, బండా వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులు బీఆర్ఎస్ పార్టీకి కొత్తేం కాదు

## మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా శనివారం బీఆర్ఎస్ పార్టీ నిరసన ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పరకాల పట్టణంలోని నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. వైస్ చైర్మన్ విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమర్జెన్సీ నడుస్తుందన్నారు. ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడని మండిపడ్డారు. నిర్బంధ అరెస్టులు, అక్రమ కేసులు బీఆర్ఎస్ పార్టీకి కొత్తేమీ కాదన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్ దామెర మొగిలి, 8వ వార్డు కౌన్సిలర్ అడప రాము, 13వ వార్డు కౌన్సిలర్ శనిగరపు రజినీ నవీన్, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి దుప్పటి సుజయ్ రణదేవ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ నక్క చిరంజీవి, బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, కవాటి శ్రీధర్ ఉన్నారు.

# గౌడల ఐక్యతకు "గోపా" వేదిక

➲ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్



**వరంగల్ వాయిస్, జనగామ :** బహుజన రాజ్యాధికార సాధన లక్ష్యసాధనకు ముందు నిలిచే గౌడుల ఐక్యతకు గౌడ అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) వేదికగా పని చేస్తుందని గోపా జనగామ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు గౌడ్ అన్నారు. శనివారం ఉదయం జరిగిన గోపా జనగామ పట్టణ కమిటీ ఎన్నికల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ గౌడ జనులందరూ తమ తమ ప్రాంతాలలో గౌడుల పిల్లలను విద్యావంతులుగా చేయుటకు తోడ్పాటు అందించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఉండే పట్టణ గోపా కార్యవర్గం ఆదర్శంగా ఉండి పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు భైరగోని శ్రీనివాస్ గౌడ్, రాజా సంపత్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం క్రింది వారితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## పట్టణ గోపా అధ్యక్షుడిగా రామకృష్ణ..

జిల్లా కేంద్రం జనగామ పట్టణ గోపా అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు గునీగంటి రామకృష్ణ మలిసారి ఎన్నికయ్యారు, ఉపాధ్యక్షులుగా బొల్లెపల్లి విశ్వనాథ్ గౌడ్, కోతి విజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కక్కర్ల శ్రీనివాస్ గౌడ్, కోశాధికారిగా కన్నా శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శులుగా పాముకుంట్ల కిరణ్ గౌడ్, అనంతుల అనిల్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పాముకుంట్ల సుధాకర్ గౌడ్, సుధగాని విజయ్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా రంగు సుధాకర్ గౌడ్, గైకోటి రాజ్ గౌడ్, కళ్లెపు వీరేష్ గౌడ్, పరకాల శ్రీనివాస్ గౌడ్, మేడిపల్లి కృష్ణ గౌడ్ ఎన్నికయ్యారు.

# అయ్యప్ప స్వాములకు అన్నదానం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని శిరిడి సాయిబాబా ఆలయంలో శనివారం అయ్యప్ప స్వామి భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. అయ్యప్ప స్వామి భక్తులతో పాటు ఇతర భక్తులు కూడా అన్నదానంలో పాల్గొన్నారు. స్వామి శరణం అయ్యప్ప శిరిడి సాయి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులతో పాటు కాంగ్రెస్ నాయకులు ఆర్.రాజేందర్, చోటా మియా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల నియోజకవర్గ శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం సంగెం మండలంలోని టెక్స్ టైల్ పార్క్ లో శనివారం తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సభకు నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్, ప్రధాన కార్యదర్శి డా.కుడ్ల మలహల్ రావుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ఈర్ల చిన్ని, గోల్కొండ సదానందం, పర్నెం తిరుపతి రెడ్డి, పర్నెం మల్లారెడ్డి, వివిధ గ్రామ కమిటీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యకుడు అప్పం కుమారస్వామి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడలు ప్రారంభం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం సీఎం సీఎం కప్ 24 క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మండలానికి సంబంధించిన పాఠశాలల విద్యార్థులు అనేకమంది పాల్గొని క్రీడలు జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నక్కపల్లి భాస్కర్, కాంగ్రెస్ నాయకులు రాజేందర్, వి.నారాయణ గౌడ్, ఎం.శివ శంకర్ గౌడ్, చోటే మియా, కృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల యాప్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, దామెర :** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల యాప్ ను పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ఊరుగొండ గ్రామ కార్యదర్శి రామ్మూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జక్కుల రవీందర్, నల్ల సుధాకర్, సంధి మంజుల, పోలేపాక రాణి, గొల్లపెల్లి కవిత, జిల్లా నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలేపాక శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జన్ను రామచందర్, సీనియర్ నాయకులు గంప సదానందం, గ్రామ పార్టీ అధ్యక్షులు పోలేపాక భిక్షపతి, సంది రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పెరల్స్ వారి సహకారంతో సర్వోదయ మిత్రమండలి దాస్యం ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం న్యూ శాయంపేట, సోమిడి ప్రభుత్వ పాఠశాలలో 80వేల రూపాయల విలువ గల సైకిళ్లను రోటరీ క్లబ్ అధ్యక్షురాలు వాణి, అసిస్టెంట్ గవర్నర్ శాంతి, ఫౌండేషన్ చైర్మన్, జీడబ్ల్యూఎంసీ 60వ డివిజన్ కార్పొరేటర్ డా.దాస్యం అభినవ్ భాస్కర్ నిరుపేద విద్యార్థినిలకు సైకిళ్లను అందించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డైరెక్టర్స్ నవీన్, మాధవి, మాజీ సెక్రటరీ జయ పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కివి విద్యార్థుల ప్రతిభ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈనెల హనుమకొండ జిల్లా జక్రియా ఫంక్షన్ హాల్ లో బీఎంఆర్ కరాటే డూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వారు జాతీయ స్థాయి కరాటే చాంఫియన్ షిప్–2024 పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు గాను 4 రాష్ట్రాల నుంచి 550 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారని, వరంగల్ జిల్లా కరీంబాద్ కివి హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు కుమిటి అండ్ కటాస్ విభాగంలో కాంస్య, వెండి పతకాలు సాధించినారని దాసి సతీష్ మూర్తి ఈ సందర్భంగా తెలిపారు. సాత్విక్, ఎస్ వరుణ్, ఎం.యోజిత్, జె.లలిత్, వి.సాయి చరణ్, బంగారం పతకాలు, విష్ణు, నంద కిషోర్, సోనం, కన్నయ్య, సృజన్ లు వెండి పతకాలు పొందారని పేర్కొన్నారు. వీరందరిని వ్లాగ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ దాసి సతీష్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్, కోచ్ లు బండారి సంతోష్, యూర నదీప్ అభినందించారు.

# రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ కేసులు



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రజల కోసం ప్రతినిత్యం పరితపించే నాయకుడు తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి హరీష్ రావుపై ప్రభుత్వం కక్ష పూరితంగా అక్రమ కేసులు బనాయించడం అన్యాయమని బీఆర్ఎస్ సోషల్ మీడియా చర్ప్ టీహెచ్ఆర్ సేన దాసరి రవి అన్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రజలలో ఎత్తి చూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజలలో హరీష్ రావుకు పెరుగుతున్న ఇమేజ్ ను చూసి ఓర్వలేకనే, హరీష్ రావుకు భయపడే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులను పెట్టిస్తోందని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ఆయన నియంత పాలనకు చమర గీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఇలాంటి కేసులను హరీష్ రావు ఎన్నో ఎదుర్కొన్నారని, మచ్చలేని నాయకుడికి ఇవి ఒక లెక్కన అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి మాజీ మంత్రి హరీష్ రావుపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వివరాల నమోదు

➲ ఎలాంటి పొరపాట్లకు తావివ్వద్దు
➲ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**వరంగల్ వాయిస్, ములుగు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అర్హులను గుర్తించడానికి ఇండ్ల స్థలాల వివరాల నమోదు కీలకమని, నమోదు సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వద్దని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఇంచార్జ్ సంపత్ రావుతో కలిసి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, గ్రామ కార్యదర్శులకు పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఇందిరమ్మ ఇండ్లపై జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వెళ్లి ఇంటి స్థలాన్ని పరిశీలించి





ధ్రువీకరణ పత్రాలను, లబ్ధిదారుల ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ వివరాలను సేకరించాలని సూచించారు. లబ్ధిదారులు ఇండ్ల వద్ద లేని పక్షంలో వలస వెళ్లిన వారికి సెల్ ఫోన్ ద్వారా వివరాలను సేకరించాలని, వివరాల సేకరణను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని తెలిపారు. నిర్దేశించిన గడువు లోగా వివరాలను సేకరించాలని, ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిచేయాలన్నారు. సేకరించిన వివరాలను వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని, ఆన్ లైన్ లో నమోదు చేసే సమయంలో ఎలాంటి సమస్య తలెత్తిన సంబంధిత ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. గ్రామాలలో చేపట్టిన వివరాల సేకరణ పూర్తి సమాచారాన్ని ఎప్పటికి అప్పుడు జిల్లా అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులు ఆయా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాలనే వాడుదాం

కమలాపూర్ లో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** ప్రజలంతా చేనేత వస్త్రాలను ధరించాలని, నేత కార్మికుల తయారు చేసిన చేనేత వస్త్రాలను ధరించడం మూలంగా చేనేతకు మరింత ఉపాధి లభిస్తుందని చేనేత జౌళి శాఖ ఏడీ విజయలక్ష్మి తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారి వెంట నినాదాలు చేస్తూ చేనేత వస్త్రాలను వాడుదాం.. చేనేత రంగానికి చేయూతనిద్దామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏడీ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధి కోసం చర్యలు చేపడుతుందని, అంతరించిపోతున్న ఇక్రము చీరను, రామప్ప చీరలను చేనేత కార్మికులతో తయారు చేయించి అమ్మకాలు చేస్తుందని తెలిపారు. చేనేత కార్మికులకు మరింత ఉపాధి కల్పించేందుకు మరిన్ని సంక్షేమ పథకాలు ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనిత, వెంకటేశ్వర్లు, చేనేత సహకార సంఘం మేనేజర్ సామల దామోదర్, కార్మికులు పాల్గొన్నారు.

# ఆటో యూనియన్స్ ఆధ్వర్యంలో ర్యాలీ




**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ పిలుపు మేరకు శనివారం ములుగు జిల్లాలోని అన్ని యూనియన్ ఆటో డ్రైవర్లు, ఓనర్స్ స్వచ్ఛందంగా బంద్ పాటించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు ములుగు డీఎల్ఆర్ గార్డెన్స్ నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకు ర్యాలీ కొనసాగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపట్టటం జరిగిందని, ఆటో కార్మికులకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. అదేవిదంగా చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.20లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీతో హెల్త్ కార్డులను జారీచేసి కార్పొరేట్ ఆసుపత్రులు చికిత్స అందించే విధంగా చూడాలని అన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే ప్రభుత్వం అమలు చేయాలని, అప్పటి వరకు రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేస్తామని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కార్యదర్శి, ములుగు జిల్లా ఇంచార్జి వేల్పుల నరేష్, కన్వీనర్ ఎండీ జహీర్, టీఏడీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు గట్ల వీరాస్వామి, ఉపాధ్యక్షుడు భద్రయ్య, కోకన్వీనర్ హరీష్, మల్లేష్, తిరుపతి, అన్నీ యూనియన్ ఆటో డ్రైవర్లు ఓనర్స్ పాల్గొన్నారు.

# వరంగల్ పద్మ బ్రాహ్మణులకు ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నవంబర్ 24న చింతల్ ఫ్లైఓవర్ వరంగల్ లో జరిగిన పద్మశాలీల వన సమారాధనలో పాల్గొని సేవలందించి నందుకు గాను వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ 30 మంది పద్మ బ్రాహ్మణులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం శనివారం దేశాయిపేట రోడ్డు రామనాథపురిలోని పేరిని నిలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆడెపు రవీందర్ సభా అధ్యక్షత వహించగా వరంగల్ జిల్లా పద్మశాలి నేతలు, వరంగల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వద్నాల నరేందర్, తెలంగాణ ప్రాంత సంఘం ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, గౌరవాధ్యక్షులు కుసుమ సతీష్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, ఉపాధ్యక్షులు చిప్ప వెంకటేశ్వర్లు, యువజన అధ్యక్షుడు బేతి అశోక్, బైరి శ్యామ్, బైరి మురళీకృష్ణ, రాజు, అశోక్ తదితరులు హాజరయ్యారు. సభాధ్యక్షులు ఆడెపు రవీందర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా పద్మ బ్రాహ్మణులు చేస్తున్న సేవలను కొనియాడారు. వన సమారాధన



కార్యక్రమం పద్మ బ్రాహ్మణులు మంత్రోచ్చారణ వల్ల పండుగ శోభను సంతరించుకుందన్నారు. వరంగల్ జిల్లా పద్మశాలీలు మన పద్మ బ్రాహ్మణుల సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 30 మంది పద్మ బ్రాహ్మణులను శాలువా, షీల్డ్ తో అధ్యక్షుడు ఆడెపు రవీందర్, జిల్లా సంఘం నేతలు ఘనంగా సన్మానించారు.

# అణగారిన వర్గాలకు అండగా ప్రభుత్వం

## గోరికొత్తపల్లిలో ప్రజా పాలన విజయోత్సవాలు



**వరంగల్ వాయిస్, రేగొండ/ గోరికొత్తపల్లి :** అణగారిన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఉమ్మడి రేగొండ మండలంలో ప్రజా పాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా శనివారం గోరికొత్తపల్లి మండల కేంద్రంలో, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున డప్పు చప్పులతో బాణాసంచ కాల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, మండల నాయకులు సుదనబోయిన ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాయ మాటలతో దొంగ హామీలతో తెలంగాణ ప్రజలందరినీ మోసం చేశారని మండిపడ్డారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసి చూపిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500లకే గ్యాస్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ పథకాలను అమలు చేసి, ఇందిరమ్మ ఇల్లు, గృహలక్ష్మి పథకంలో భాగంగా అర్హులైన ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం అమలకు ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. ప్రజలు గమనించాల్సిన విషయం ఏమిటంటే గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, పేదల కోసం, ప్రజల కోసం పనిచేసే ప్రజా వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిన పాపం, గత పాలకులదని అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్న మొక్కవోని దీక్షతో ధైర్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయటం దేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయమన్నారు. ప్రభుత్వం చేసిన కుంభకోణాలు, దందాలకు పేదలపై భారం పడిందన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, ఎన్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్ రావు, రేగొండ పీఏసీఎస్ నడిపెల్లి విజ్జన్ రావు, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మి రవి, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, గోరికొత్తపల్లి ఎమ్మార్వో వీరభద్రం, ఎంపీఓ గడ్డం రాంప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి బాలవేని రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం వీరేందర్, జిల్లా నాయకులు అప్పం కిషన్, మేకల భిక్షపతి, గంగుల రమణారెడ్డి, మండల నాయకులు మాటికే సంతోష్, బొల్లెపెల్లి చంద్రమౌళి, ఓబీసీ మండల అధ్యక్షుడు పొనుగోటి వీరబ్రహ్మం, మాజీ ఎంపీటీసీలు పట్టెం శంకర్, మైస భిక్షపతి, దుగ్యాల రాజేశ్వరరావు, చిగురుమామిడి కుమారస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తొకల సురేందర్ రెడ్డి, సందేల మధుకర్, సందేలా రాంబాబు, నండ్రే రవీందర్, నాయకులు వైనాల ప్రభాకర్, శ్రీరామ్ రాజు, యూత్ మండల అధ్యక్షుడు జూపాక అశోక్, తదితరులు జిల్లా, మండల , నాయకులు పాల్గొన్నారు .

## ఆటో యూనియన్ బంద్ విజయవంతం



**వరంగల్ వాయిస్, రేగొండ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆటో యూనియన్ బంద్ ఉమ్మడి రేగొండ మండలంలో విజయవంతమైంది. మండలంలోని శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం బంద్ ను చేపట్టారు. ఆటో కార్మికులంతా బందులో పాల్గొని సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షుడు సాంబయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీలను నెరవేర్చకపోవడంతో ఆటోడ్రైవర్ల జీవన భృతి ఆందోళనకరంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హామీలను నెరవేర్చలేని ఎడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సంవత్సరానికి రూ.12 వేలు, ఉచితంగా ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం వలన ఆటో కార్మికుల జీవనం గడవడం ఇబ్బందికరంగా మారిందన్నారు. కనీసం రోజుకు కుటుంబం గడిచే పరిస్థితి లేదన్నారు. ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొంగు భిక్షపతి, కోశాధికారి మార్క కమలాకర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఘనంగా భారతీయ భాషా ఉత్సవం




వరంగల్ వాయిస్, హనుమకొండ : ప్రముఖ తమిళ కవి చిన్నస్వామి సుబ్రహ్మణ్య భారతి జయంతి వేడుకలను పురస్కరించుకొని భారత ప్రభుత్వం భాషా ఉత్సవాలను నిర్వహిస్తుంది. భారతీయ భాషా ఉత్సవాలలో భాగంగా ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలలో భాషా ఉత్సవం శనివారం నిర్వహించడం జరిగింది. భాషలతో దేశ సమైక్యత సాధించడం అనే అంశంతో ఈ సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాషా ఫెయిర్ ను నిర్వహించాలని జారీచేసిన ఆదేశాలకు అనుగుణంగా నేడు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలకు సంబంధించిన భాషా ప్రత్యేకతలను, భాష కోసం పాటుపడిన కవులు, రచయితల చిత్రపటాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ కె.వాసు, భాషలు బోధించు ఉపాధ్యాయులు డాక్టర్ పద్మావతి, వలస పైడి, సరిత, సమ్మిరెడ్డి, కాంతయ్య, రజిత, రుబీనా తబస్సుం విభిన్న భాషలు కలిగిన మన భారతదేశం భిన్నత్వంలో ఏకత్వంతో ఎట్లా వర్ధిల్లుతున్నదో వివరించారు. స్టాఫ్ సెక్రటరీ మధుసూదన్ రెడ్డితో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రదర్శనను తిలకించారు.

## విశ్వబ్రాహ్మణ యూత్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నారాయణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా విశ్వబ్రాహ్మణ యూత్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నారాయణ గిరి రాజును నియమిస్తూ విశ్వ బ్రాహ్మణ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం వేణు చారి ఉత్తర్వులు జారీ చేసి శనివారం నారాయణ గిరి రాజుకు హనుమకొండలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణగిరి రాజు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం వేణు చారికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ సంఘ శ్రేయస్సుకు పాటుపడుతూ విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అలాగే సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. బీసీ సమస్యలపై కూడా ఉద్యమిస్తానని, తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిస్తానని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ యూత్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా తన వంతు కర్తవ్యాన్నీ మనస్ఫూర్తిగా నిర్వహిస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దోజు వెంకటాచారి, దూదికట్ల సర్వేశ్వర చారి, సిద్దోజు రాకేష్, సలేంద్ర రవీంద్ర చారి,పెద్దోజు షణ్ముఖ చారి, బండ్ల అశోక్, బ్రహ్మాచారి, రంజిత్ పాల్గొన్నారు.

## స్వర్ణగిరి దేవాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పూజలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** భువనగిరి పట్టణ శివారులోని ప్రముఖ వైష్ణవ స్వర్ణగిరి స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద వెంకటేశ్వర స్వామి ఆలయం స్వర్ణగిరి అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రిపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలకు రెట్టించిన ఉత్సాహంతో సేవ చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పాడి పంటలు, ప్రజా ఆరోగ్యం బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆలయ అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లయన్ బాల్దే సోమయ్య మృతి



**వరంగల్ వాయిస్, జనగామ :** లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ పూర్వ అధ్యక్షుడు లయన్ బాల్దె సోమయ్య (65) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా అస్వస్థతతో ఉండి నిన్న రాత్రి శాశ్వతంగా కన్ను మూశారు. దివంగత లయన్ నాయకుడు జనగామ పట్టణ కురుమ సంఘం మాజీ అధ్యక్షులు, జనగామ మున్సిపల్ మాజీ కౌన్సిలర్, ప్రస్తుతం కురుమ సంఘం కోపా గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కురుమ సంఘానికి ఎన్నో సేవలు అందించిన, బాల్దె సోమయ్య మృతి కుటుంబ సభ్యులు, కురుమ సమాజానికి తీరని లోటని పలువురు వాపోయారు. వీరు నివాసం ఉంటున్న 3వ వార్డుకు చెందిన రాజకీయ నాయకులు, ప్రముఖులు, లయన్స్ ప్రముఖులు వారి గృహం సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. దివంగత లయన్ కు భార్య, వివాహితులైన ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## మైత్రీ ట్రాన్స్ క్లినిక్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా ఏరియా ఆసుపత్రిలో ట్రాన్స్ జెండర్ల కోసం మైత్రి ట్రాన్స్ క్లినిక్ ను ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ ముఖ్య అతిథి గా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గురువారం ట్రాంజెండర్స్ మైత్రి ట్రాన్స్ క్లినిక్ ను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే సంక్షేమ పథకాలలో వారికి లబ్ధి చేకూరాలని ఆకాంక్షించారు. మహబూబాబాద్ పట్టణంలోని అంగన్వాడి సెంటర్, జామాండ్లపల్లి నడివాడ అంగన్ వాడీ సెంటర్ ను ప్రారంభించి విద్యార్థులకు యూనిఫార్మ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూ ధనమ్మ, సీడీపీఓ శిరీష, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్, డాక్టర్ జగదీష్ బానోత్, ట్రాన్స్ జెండర్ జిల్లా అధ్యక్షులు వర్ష, ఉపాధ్యక్షులు హరిణి, పావని, వాహిని, స్వప్న పాల్గొన్నారు.

## కుల గణనకు చివరి అవకాశం

**వరంగల్ వాయిస్, గణపురం :** గణపురంలో కుల గణన చేస్తున్న క్రమంలో మిగిలినవారు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కార్యదర్శి విజేందర్ కోరారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ కులగణన చేస్తున్న క్రమంలో కొందరు మిగిలిపోతే వెంటనే వారి పేర్లకు సంబంధిత ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ లను తీసుకొని రావాలని కోరారు. ఈ అవకాశం మళ్లీ దొరకదని విజేందర్ విజ్ఞప్తి చేశారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, డిసెంబర్ 06, 2024

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి పూజలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండలంలోని తోడేళ్ల గూడెం గ్రామంలో సమీపంలోని గుట్ట లోపల వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి సందర్భంగా విగ్రహానికి అర్చకులు రవి కిషోర్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. విగ్రహానికి జలాభిషేకం, పాలాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్నెగుండ్ల, తోడెళ్లగూడెం, ముల్కలపల్లి గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా గుట్ట ప్రాంగణం భక్తులతో కిటకిటగా మారి సందడి వాతావరణం సంతరించుకుంది.

## రావుల శశిధర్‌కు సత్కారం

### విశ్వ బ్రాహ్మణ యూత్ అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వాణిజ్య పన్నుల శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా జాయింట్ కమిషనర్ రావుల శశిధర్‌ను విశ్వ బ్రాహ్మణ యూత్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. జేసీ శశిధర్‌ను కలిసిన వారిలో విశ్వ బ్రాహ్మణ యూత్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఐలాపురం వేణుచారి, ఉపాధ్యక్షులు పెద్దోజు వెంకటాచారి, జిల్లా అధ్యక్షులు నారాయణగిరి రాజుచారి, పెద్దోజు షణ్ముకాచారి, అశోక్, సీనియర్ జర్నలిస్టులు సర్వేశ్, సలేంద్ర రవీంద్రాచారి, సిద్దోజు రాకేష్ చారి, తదితరులున్నారు.

## పోలింగ్ కేంద్రాల, ఓటర్ల వివరాల వెల్లడి



**వరంగల్ వాయిస్, దామెర :** రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండంలోని మొత్తం 132 వార్డులలో, వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలు, పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య, పోలింగ్ కేంద్రాల ప్రదేశాల వివరాలను తెలియజేస్తూ అన్ని గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రచురణ చేపట్టినట్లు మండల పంచాయతీ అధికారి రంగాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు నరేష్ మనోహర్, వేణు, శీను, రజిత, శివ పాల్గొన్నారు.

## పులుకుర్తిలో సీఎం కప్ పోటీలు



**వరంగల్ వాయిస్, దామెర :** పులుకుర్తి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో ముఖ్యఅతిథిగా గ్రామపంచాయతీ సెక్రటరీ అర్షం శ్రీను, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం జమ్ము నాయక్, పీఎస్ స్కూల్ టీచర్స్, గ్రామంలోని మాజీ సర్పంచ్ గన్ను సరస్వతి, వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ బొల్లం వేణుగోపాల్, స్కూల్ పీఈటీ, కారోబార్ ఆనంద్ పాల్గొన్నారు.

# తొర్రూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

### ● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని, గీత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, తొర్రూరు మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని అన్నీ వార్డులను అభివృద్ధి చేసేందుకు సాయశక్తుల కృషి చేస్తున్నానని, మున్సిపాలిటీ నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులను తీసుకోవచ్చి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేస్తారని తెలిపారు. మున్సిపాలిటీలో శనివారం పదవ వార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.15 లక్షలతో మంజూరైన గ్రావెల్ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పనులు ప్రారంభించారు. అలాగే, మున్సిపాలిటీలోని 10 వ వార్డులో రూ. 15లక్షలతో మంజూరైన నూతన గౌడ కమ్యూనిటీ హాల్ భవనం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారని, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఇప్పటికే ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండల అధ్యక్షుడు సంతోష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అచ్చిరెడ్డి, వెంకటాచారి, నాయకులు వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు పెద్దగాని సోమన్న, గంజి విజయపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాపు రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రవణ్, ముఖ్య నాయకులు, గౌడ కులస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

## తాటి చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోండి



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండంలోని గట్టి కల్లు గ్రామంలో ఈ నెల 5న చిన్నాల లక్ష్మినారాయణ అనే వ్యక్తి కల్లు పారే 50 తాటి చెట్లను జేసీబీతో నెలకూల్చాడు. ఈ ఘటపై జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ అధికారుల అనుమతి లేకుండా తాటి చెట్లను తొలగించిన లక్ష్మినారాయణపై ఎక్సైజ్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకొని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని తెలగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గట్టికల్లు సోసైటీ అధ్యక్షులు మెరుగు ప్రభాకర్, పెద్దగాని భిక్షపతి, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు గండి రాజన్న గౌడ్, చిర్ర నాగరాజ్ గౌడ్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మటూరి రవీందర్ గౌడ్, పర్నాల సమ్మయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను కలిసిన రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్ హెచ్ఎం ఉద్యోగుల రాష్ట్ర వ్యాప్తంగా 17, 541 ఈ రాష్ట్రంలో పనిచేస్తున్నారు. ఉద్యోగులందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేసి బేసిక్ పే అమలు చేయాలని, అలాగే 9న అసెంబ్లీ సమావేశాలలో ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమస్యలకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని తెలియజేశారు. పోచం మైదాన్ లో వారి ఇంట్లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ మీ సమస్యలు ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, యువనేత మురళి, దామర కృష్ణ, కోఠి తదితరులు పాల్గొన్నారు.

## వేయి స్తంభాల ఆలయంలో నాయిని ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి కళ్యాణం సందర్భంగా వరంగల్ వేయి స్తంభాల దేవాలయంలో కల్యాణ మహోత్సవ వేడుకలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి నీలిమ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుద్రేశ్వరుడికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, కళ్యాణం వేడుకలో భాగస్వామ్యమయ్యారు. ప్రజా ప్రభుత్వ ప్రజా పాలన విజయోత్సవ వేడుకలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విజయవంతంగా తొలి ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలకు,పశ్చిమ నియోజకవర్గం



ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ భగవంతుడి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజా ప్రభుత్వానికి ఉండాలని ఎమ్మెల్యే నాయిని కోరుకున్నారు.

# ఆర్టీఐ కమిషనర్లను ప్రభుత్వం నియమించాలి

### ➲ సమాచార హక్కు చట్టం సాధన కమిటీ

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శిగా ఎర్రబెల్లి ప్రగతిని నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్.చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రగతి మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం కమిషనర్లను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీఐ కమిషనర్ ఆఫీస్ లో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. కాబట్టి, ప్రభుత్వం వెంటనే ఆర్టీఐ కమిషనర్లను నియమించాలని అన్నారు. తెలంగాణలో వివిధ రకాల ప్రభుత్వ కార్యాలయాలలో ఎన్నో ఆర్టీఐ దరఖాస్తులకు సరైన సమాధానాలు ఇవ్వకుండా ఆర్టీఐ కార్యకర్తలకు అధికారులు స్పందించక నిర్లక్ష్యం చేస్తూ దరఖాస్తులు వేలల్లో పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు.ఆర్టీఐ



దరఖాస్తులకు స్పందించి తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, తెలంగాణ మహిళా కార్యనిర్వహక అధ్యక్షురాలు జి.ప్రియా రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్, ఎర్రబెల్లి రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకెప్పుడు నటించకన్నారు..?

'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో అభినందనలు అందుకుంటున్న అందాల రష్మిక.. తన తాజా ఇంటర్వ్యూ ద్వారా ఆనందాన్ని వ్యక్తంచేస్తూ.. పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడిరచింది. "శ్రీవల్లి' లాంటి పాత్ర చేసినందుకు నన్నందరూ మంచి నటి అని మెచ్చుకుంటున్నారు. కానీ నా స్కూల్ టైమ్‌లో ఓసారి స్టేజ్ షో చేశా. అది ఎవరికీ నచ్చలేదు. కొందరైతే.. 'ఇంకెప్పుడూ నటించకు' అని ఉచిత సలహా కూడా పారేశారు' అంటూ అందంగా నవ్వేసింది రష్మిక. ఇంకా చెబుతూ 'పదిమందిలో ఉన్నప్పుడు అక్కడ నన్నెవరూ నవ్వుతూ పలకరించకపోతే.. ఆ ప్రదేశంలో నేనుండలేను. అది నా బలహీనత. అంతేకాదు, కొన్ని రూమర్ల వల్ల కూడా కన్నీరు పెట్టుకున్న సందర్భాలున్నాయి. నా రెమ్యునరేషన్ గురించి ఏవేవో రాశారు. నిజానికి డబ్బు గురించి అస్సలు పట్టించుకోను. తొలి సినిమాకు తీసుకున్న పారితోషికం కేవలం రెండున్నర లక్షలు. నాకు క్యారెక్టర్ ముఖ్యం. అయితే.. డబ్బు తక్కువ ఇచ్చినా పర్లేదు కానీ.. ఫ్రీగా మాత్రం చేయకూడదనేది నా పాలసీ' అని చెప్పారు 'ఓ మంచి బయోపిక్‌లో నటించాలి. అలాగే.. 'బాహుబలి'లో దేవసేన లాంటి పాత్ర చేయాలి. ఈ రెండు కోరికలు ఎప్పుడు తీరతాయా అని ఎదురు చూస్తున్నా' అని తెలిపారు రష్మిక. ప్రస్తుతం రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్, కుబేర, సికిందర్, ఛావా, థామ చిత్రాల్లో నటిస్తూ ఆమె బిజీబిజీగా ఉన్నది.





## సాయిపల్లవితో అంటే భయం

టాలీవుడ్ అగ్ర కథానాయికలలో సాయిపల్లవి ఒకరు. భానుమతి హైబ్రిడ్ పిల్లా అంటూ ఫిదా సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే కుర్రకారు మనసులను దోచుకుంది ఈ భామ. అనంతరం మిడిల్ క్లాస్ అబ్బాయి, పడి పడి లేచే మనసు, లవ్ స్టోరీ, శ్యామ్ సింగరాయ్, విరాట పర్వం తదితర చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ భామ. ప్రస్తుతం నాగ చైతన్యతో తండేల్ అనే సినిమాలో నటిస్తుంది. అయితే రీసెంట్‌గా ఒక టాక్ షోలో పాల్గోన్న నాగ చైతన్య సాయి పల్లవి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. దగ్గుబాటి హోస్ట్‌గా చేస్తున్న టాక్ షో ది రానా దగ్గుబాటి షో. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమవుతున్న ఈ షోలో రీసెంట్‌గా నాగ చైతన్య గెస్ట్‌గా వచ్చాడు. అయితే షోలో భాగంగా రానా సాయి పల్లవి గురించి అడుగగా.. చైతూ మాట్లాడుతూ.. సాయిపల్లవితో నటించాలి అన్న.. డాన్స్ చేయాలన్న భయం వచ్చేస్తది బావ (రానా). నువ్వు సాయిపల్లవితో విరాట పర్వం సినిమా చేసి ఒక్క సాంగ్ కూడా పెట్టకుండా భలే తప్పించుకున్నావు. కానీ నాకు అలా లేదు తనతో చేసేటప్పుడు నేను బానే చేస్తున్నానా అని సందేహం వస్తుంది అంటూ నాగ చైతన్య చెప్పుకోచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



### అమీర్‌ఖాన్ తనయుడితో సాయిపల్లవి..

దక్షిణాదిలో తిరుగులేని గుర్తింపును సంపాదించుకున్న అగ్ర కథానాయిక సాయిపల్లవి ఇప్పుడు బాలీవుడ్‌పై దృష్టి పెడుతున్నది. 'రామాయణ' చిత్రం ద్వారా ఆమె హిందీ చిత్రసీమలోకి అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాతో పాటు అమీర్‌ఖాన్ తనయుడు జునైద్‌ఖాన్‌తో కలిసి ఓ ప్రేమకథా చిత్రంలో నటిస్తున్నది. అమీర్‌ఖాన్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు సునీల్‌పాండే దర్శకుడు. ఈ చిత్రానికి 'ఏక్ దిన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని అమీర్‌ఖాన్ స్వయంగా వెల్లడిరచారు. హృద్యమైన ప్రేమకథాంశమిదని, ఈ సినిమాతో సాయిపల్లవి ఉత్తరాది యువతకు చేరువవుతుందని చిత్రబృందం పేర్కొంది. ఇదిలావుండగా ఇటీవల విడుదలైన 'అమరన్' చిత్రంలో సాయిపల్లవి అద్భుతాభినయానికి సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. ఈ సినిమా బాలీవుడ్‌లో కూడా హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి హిందీ సినిమాల తాలూకు అప్‌డేట్స్‌పై అక్కడి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అలాంటి సినిమాలు తీయొద్దు ప్లీజ్..

పురుషాధిక్యాన్ని, పితృస్వామ్య భావనలను ప్రతిబింబించే సినిమాలను తాను వ్యతిరేకిస్తానని, అలాంటి కథలు సమాజాన్ని కొన్ని ఏళ్లు వెనక్కి తీసుకెళ్తాయని వ్యాఖ్యానించారు బాలీవుడ్ అగ్ర నటుడు, మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ అమీర్‌ఖాన్. ఇటీవల ఓ అంతర్జాతీయ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పైవిధంగా స్పం దించారు. 'గతకొంతకాలంగా మేల్ డామినేట్ స్టోరీస్ ఎక్కువగా వస్తున్నాయి. దశాబ్దాల కిందటే సమసిపోయిన పితృస్వామ్య భావాలను ప్రోత్సహించే కథాంశాలను తెరకెక్కిస్తున్నారు. అలాంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను సాధిస్తున్నాయి. ఈ ధోరణి మంచిది కాదు. ఇప్పుడు సమాజం అన్ని రంగాల్లో ఆధునిక ఆలోచనలతో పురోగమిస్తున్నది. అయినా ఇప్పటికీ పరిష్కారించాల్సిన సామాజిక సమస్యలున్నాయి. వాటిపై దృష్టి పెడితే సమాజ అభ్యున్నతికి సృజనాత్మక మార్గంలో సహాయం చేసినవాళ్లమవుతాం. స్త్రీకి కొంతమేరకే స్వేచ్ఛనివ్వాలనే ఆలోచనలు పురుషుల్లోని అభద్రతాభావాన్ని సూచిస్తాయి. నేటి స్త్రీలు స్వీయ నిర్ణయాలతో ముందుకెళ్తున్నారు. వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత పురుషలపై ఉంది' అని అమీర్ వ్యాఖ్యానించారు. స్త్రీ సాధికారత ప్రధానాంశంగా ఆయన నిర్మించిన 'లాపతా లేడీస్' చిత్రం ప్రశంసలతో పాటు ఈ ఏడాది భారత్ నుంచి ఆస్కార్ బరిలో పోటీపడుతున్న అధికారిక చిత్రంగా నిలిచింది. ప్రస్తుతం అమీర్‌ఖాన్ 'తారే జమీన్ పర్' సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది విడుదల కానుంది.



## చిరంజీవి విశ్వంభర

# ఆరోజైనా.. వచ్చేనా ?

చిరంజీవి 'విశ్వంభర' సినిమా కోసం మెగా అభిమానులంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. నిజానికి ఈ సినిమా సంక్రాంతికి రావాల్సింది. కానీ 'గేమ్ చేంజర్' సంక్రాంతికి వస్తుండటంతో 'విశ్వంభర'ని వాయిదా వేయాల్సొచ్చింది. ఇటీవలే చిత్రీకరణ పూర్తిచేశారు. రిలీజ్ డేట్‌ని మాత్రం మేకర్స్ ప్రకటించలేదు. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాను ఏప్రిల్ 10న విడుదల చేయడానికి నిర్మాతలు వి.రామకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్‌రెడ్డిలు సన్నాహాలు చేస్తున్నారట. ఇదిలావుంటే.. అటు ఇటుగా అదేటైమ్‌లో ప్రభాస్ 'రాజా సాబ్' సినిమా కూడా విడుదలకు సిద్ధమవున్నది. ఏప్రిల్ రెండోవారంలో 'రాజా సాబ్' రిలీజ్ కానున్నట్లు గతంలోనే చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే.. ప్రభాస్ అనుబంధ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న 'విశ్వంభర'కు పోటీగా, ప్రభాస్ 'రాజా సాబ్' రావడం జరిగే పని కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏమవుతుందో చూడాలి. ఇదిలావుండగా ఇటీవలే చిరంజీవి కొత్త సినిమా ప్రకటన వెలువడిన విషయం తెలిసిందే. యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించనున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, డిసెంబర్ 07, 2024





# భూ నిర్వాసితులను ఆదుకుంటా

- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ లో భూములు కోల్పోయిన వారిని ఆదుకుంటామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం భూ నిర్వాసితుల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేటలోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ చేరుకున్న మంత్రి తొలుత పార్క్ ను సందర్శించారు. అనంతరం టెక్స్ టైల్ పార్క్ పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన శాఖ ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని, రూ.58 లక్షలతో నిర్మించనున్న వెటర్నరీ హాస్పిటల్, రూ.10 కోట్లతో మైక్రో మినీ స్మాల్ ఇండస్ట్రీస్ (ఎమ్మెస్మీ) పార్క్ లో రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సరఫరా తదితర అభివృద్ధి పనులకు ,పంచాయతి రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో సంగెం మండలం లోహిత నుంచి గోపనపల్లి గ్రామం వరకు రూ.4.80 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ భూ నిర్వాసిత లబ్ధిదారులకు పారదర్శకంగా డ్రా పద్ధతిలో 863 ఆర్ఎన్ఆర్ లేఔట్ ప్లాట్ల పట్టాలను అందించారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రావుల రాజేశ్వరరావు, నిర్మల జగ్గారెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

### విప్ర బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ ప్రారంభం..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ గొర్రెకుంటలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన విప్ర బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ ను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే కాకుండా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశలు కల్పించాలనే పట్టుదలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని అన్నారు. మెగా టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఏయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మన ముందే ఉన్నాయని అన్నారు.







# సస్పెన్షన్ లో ఉన్న ఉద్యోగి గుండె పోటుతో మృతి

**బల్దియా ఎదుట మృతదేహంతో ధర్నా**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట గుండెపోటుతో మృతి చెందిన పీహెచ్ వర్కర్ మృతదేహంతో కుటుంబ సభ్యులు శనివారం ఆందోళనకు దిగారు. రెండేళ్ల క్రితం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో డీజిల్ కుంభకోణంలో పీహెచ్ వర్కర్ కనకం రఘు సస్పెన్షన్ కు గురయ్యారు. అయితే డీజిల్ కుంభకోణంలో కనకం రఘును బలి చేశారని, అతను కేవలం వాచ్ మెన్ పాత్ర పోషించారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కుంభకోణంలో పెద్దస్థాయి అధికారులు చేసిన తప్పులకు కిందిస్థాయి ఉద్యోగి బలి అయ్యాడని ఆరోపించారు. ఇటీవలే కోర్టు సైతం రఘుకు అనుకూలంగా తీర్పునిచ్చినప్పటికీ ఓ అధికారి కావాలని మళ్లీ ఇబ్బంది పెట్టాడని, ఆయన వేదింపులతోనే గుండె పోటుకు గురయ్యారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. సదు అధికారి ఏమి చూడకుండానే సంతకాలు పెట్టి కిందిస్థాయి ఉద్యోగులను బలి పశువులను చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సదరు ఉద్యోగికి నష్టపరిహారం చెల్లించడంతోపాటు, కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# మా బిల్డింగ్ మాకే కావాలి

- నర్సింగ్ కళాశాలకు కేటాయించడం సరికాదు
- ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతి

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** నేషనల్ ఆయుస్ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లాలో కేంద్రంలో నిర్మించి 50 పడకల ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ను నర్సింగ్ కాళాశాలకు కేటాయించడం సరికాదని నేషనల్ మెడికల్ అసోసియేషన్ ఆయుష్ అధ్యక్షుడు డాక్టర్ గుండా రవీందర్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ మైదం రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఇజ్జిగిరి సురేష్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ దుర్గ ప్రసాద్, డాక్టర్ శ్రీకాంత్ ఆరోపించారు. ఈ విషయాన్ని శనివారం ప్రిన్సిపల్ సెక్రెటరీ కూడా తెలియజేసినట్లు వెల్లడించారు. అయితే ఆయుష్ డిపార్ట్ మెంట్ కు కేటాయించిన భవనాన్ని వారికే వినియోగించాలని సూచించారు. అలా కాకుండా నర్సింగ్ కాలేజీకి కేటాయిస్తూ రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ, రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక శాఖ డిపార్ట్మెంట్ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి భవనానికి అలాట్ చేసి పేద ప్రజలకి జయశంకర్ భూపాలపల్లిలో ఆయుర్వేద వైద్య చికిత్సల కొరకు ఈ భవనం ఇవ్వాలని సూచించారు.




# లంచం ఇచ్చినా తీసుకున్నా నేరం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న అవినీతి వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని అవినీతి వ్యతిరేకంగా విద్యార్థులకు అవగహన కల్పించడం కోసం ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు కాలేజీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ చేతుల మీదుగా శనివారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో బహుమతి ప్రధానం చేశారు. అలాగే ఈ వారోత్సవాల సందర్భంగా ఈ ఏడాది అవినీతికి పాల్పడిన ప్రభుత్వ అధికారిపై ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టు సాక్ష్యాన్ని ఇవ్వడంతో అవినీతి అధికారికి ఒక సంవత్సరం జైలు శిక్ష పడటంలో ప్రముఖంగా నిలిచిన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ప్రాంతానికి చెందిన బాలేం వీరబద్రంని వరంగల్ పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్ స్పెక్టర్లు సాట్ల రాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com